TELUGU & ENGLISH డిజిటల్ మీడియా | FAST NEWS | VIDEO NEWS | e-PAPER | DIGITAL SERVICES | 24/7

టీ-మీడియా

సామాజికం ... ప్రజల పక్షం ... 24/7 ప్రజా సేవలో...

వార్తలు | వీడియోలు | ఫోటోలు | ఇంటర్వ్యూలు | ప్రజా సమస్యలు | ప్రత్యేక కథనాలు | విశ్లేషణలు

epaper,www.tmedia.net.in | YouTube | facebook

ఆదివారం 25/10/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ



రూ.10 వేల కోట్ల వ్యాపార నష్టం ముప్పు!





⏭ ఇండియా కూటమి ర్యాలీని వాయిదా వేయండి

⏭ రాహుల్ గాంధీకి ట్రేడర్స్ లేఖ

టీ మీడియా, అక్టోబర్ 24, ఢిల్లీ బ్యూరో:

దీపావళి పండుగ సీజన్‌లో ఢిల్లీలో నిర్వహించనున్న ఇండియా కూటమి ర్యాలీని వాయిదా వేయాలని చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి విజ్ఞప్తి చేసింది. నవంబర్ 1న రాంలీలా మైదాన్‌లో నిర్వహించనున్న ఈ ర్యాలీ కారణంగా వ్యాపార కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిణామాలతో సుమారు రూ.10 వేల కోట్ల వ్యాపారానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించింది. నవంబర్ 10 తర్వాత ర్యాలీ నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని కోరింది.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ నవంబర్ 1న రాంలీలా మైదాన్‌లో భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఇండియా కూటమి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో సీటీఐ ఛైర్మన్ బ్రిజేశ్ గోయల్ రాహుల్ గాంధీకి లేఖ రాశారు.

ఐదు కిలోమీటర్ల పరిధిలో 20 మార్కెట్లు

రాంలీలా మైదాన్‌కు ఐదు కిలోమీటర్ల పరిధిలో సుమారు 20 ప్రధాన హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లు ఉన్నాయని సీటీఐ తెలిపింది. చాందినీ చౌక్, సదర్ బజార్, చావ్రీ బజార్, భాగీరథ్ ప్యాలెస్, ఖారీ బావోలీ, కశ్మీరీ గేట్, నయీ సడక్, మోరీ గేట్, కినారీ బజార్, దరీబా, దర్యాగంజ్, అజ్మేరీ గేట్, జామా మసీదు, కరోల్‌బాగ్, ఆజాద్ మార్కెట్ వంటి కీలక వాణిజ్య కేంద్రాలు ఈ ప్రాంతంలో ఉన్నాయని వివరించింది.ఈ మార్కెట్ల నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు పెద్ద ఎత్తున సరుకులు సరఫరా అవుతుంటాయి. ర్యాలీ సందర్భంగా బారికేడ్లు, ట్రాఫిక్ మళ్లింపులు, ప్రజా రవాణాపై ఆంక్షలు విధిస్తే వ్యాపార కార్యకలాపాలు (మిగతా 2లో)

ఆదాయం అంతంత.. ఖర్చులు కొండంత!



⏭ ఆరు నెలల్లో రూ.15,096 కోట్ల రెవెన్యూ లోటు

టీ మీడియా ,అక్టోబర్ 24 ,హైదరాబాద్ బ్యూరో:

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కాగ్ నివేదిక కీలక వివరాలను వెల్లడించింది. 2026--27 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ రాబడులు ఆశించిన స్థాయిలో లేకపోగా, ఖర్చులు మాత్రం గణనీయంగా పెరిగాయి. దీంతో సెప్టెంబర్ నెలాఖరు నాటికి రాష్ట్రం రూ.15,096 కోట్ల రెవెన్యూ లోటును నమోదు చేసింది. పన్ను రాబడులు బడ్జెట్ లక్ష్యాలకు దూరంగా ఉండటం, కేంద్ర గ్రాంట్లు ఆశించిన మేరకు అందకపోవడం ఆర్థిక నిర్వహణపై ప్రభావం చూపుతున్నాయి.

బడ్జెట్ అంచనాల్లో 38 శాతమే ఆదాయం

2026--27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2,41,263 కోట్ల రెవెన్యూ రాబడులను అంచనా వేసింది. అయితే సెప్టెంబర్ నెలాఖరు వరకు రూ.92,013 కోట్లు మాత్రమే (మిగతా 2లో)

ధర బాగానే ఉంది.. దిగుబడే లేదు



⏭ పత్తి రైతుకు మిగిలేది నష్టమే!

టీ మీడియా, అక్టోబర్ 24, హైదరాబాద్ బ్యూరో:

పత్తికి మార్కెట్‌లో మంచి ధర పలుకుతున్నా.. పంట దిగుబడి తగ్గడంతో రైతులకు నిరాశే మిగులుతోంది. వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల ప్రభావంతో పత్తి దిగుబడులు గణనీయంగా పడిపోయాయి. ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు రావాల్సిన దిగుబడి ఐదారు క్వింటాళ్లకే పరిమితమవుతోంది. దీంతో కనీస మద్దతు ధరకు మించి మార్కెట్‌లో ధర లభిస్తున్నప్పటికీ రైతులకు పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

వేల ఎకరాల్లో పత్తి సాగు

ఈ ఏడాది ఉమ్మడి కరీంనగర్ ప్రాంతంలో రైతులు పెద్ద ఎత్తున పత్తి సాగు చేపట్టారు. కరీంనగర్ జిల్లాలో 45 వేల ఎకరాలు, పెద్దపల్లి జిల్లాలో 52 వేల ఎకరాలు, జగిత్యాల జిల్లాలో 19 వేల ఎకరాలు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 50 వేల ఎకరాల్లో పత్తి పంట సాగైనట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.సాధారణ సాగు విస్తీర్ణంతో పోలిస్తే దాదాపు 95 శాతం మేర పత్తి సాగు జరిగినప్పటికీ, ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో పంట ఎదుగుదల దెబ్బతింది. అడపాదడపా కురిసిన వర్షాలు కొంత ఊరటనిచ్చినా, వర్షాభావ పరిస్థితులు పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. దీనికి తోడు తెగుళ్లు కూడా రైతులను ఇబ్బందులకు గురిచేశాయి.ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులు, దిగుబడి తగ్గిపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు.

ధర పెరిగినా.. పెట్టుబడి దక్కేనా?

పత్తికి కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.8,600 వరకు ఉండగా, మార్కెట్‌లో అంతకంటే ఎక్కువ ధర లభిస్తోంది. జమ్మికుంట మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.9,250 వరకు (మిగతా 2లో)

విద్యుత్ ఉత్పత్తికి బొగ్గు కొరత!



⏭ క్రిటికల్ కేటగిరీలో జెన్‌కో థర్మల్ కేంద్రాలు

⏭ మూడు రోజులకూ సరిపోని నిల్వలు

టీ మీడియా , అక్టోబర్ 24, అమరావతి బ్యూరో:

విద్యుత్ రంగంపై ఎల్‌నినో ప్రభావం ఆందోళన కలిగిస్తోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమైన ఎండలు, సాగునీటి కాలువల్లో నీటి కొరత కారణంగా రైతులు బోరుబావులపై ఆధారపడుతున్నారు. దీంతో వ్యవసాయ అవసరాలకు విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. ఒకవైపు విద్యుత్ డిమాండ్ పెరుగుతుండగా, మరోవైపు థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు నిల్వలు తగ్గిపోవడం ఆందోళనకు గురిచేస్తోంది. రాష్ట్రానికి చెందిన జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లోనూ మూడు రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు లేకపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

దేశవ్యాప్తంగా బొగ్గు కొరత

దేశవ్యాప్తంగా 191 థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఉండగా, వాటిలో 96 కేంద్రాల్లో మూడు రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు కూడా లేవని నివేదికలు వెల్లడిస్తున్నాయి. సాధారణ పరిస్థితుల్లో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో 21 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉండాలి. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో బొగ్గు సరఫరా డిమాండ్‌కు అనుగుణంగా లేకపోవడంతో విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం పడే ప్రమాదం ఉంది. నవంబర్ నుంచి ఎల్‌నినో ప్రభావం మరింత పెరిగే అవకాశముందని వాతావరణ అంచనాలు వెలువడటంతో విద్యుత్ సంక్షోభంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

క్రిటికల్ కేటగిరీలో మూడు కేంద్రాలు

థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో నిర్దేశిత ప్రమాణాల కంటే బొగ్గు నిల్వలు తగ్గితే వాటిని క్రిటికల్ కేటగిరీగా పరిగణిస్తారు. ఈ నేపథ్యంలో జెన్‌కో పరిధిలోని విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్ (వీటీపీఎస్), రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (ఆర్‌టీపీపీ), కృష్ణపట్నం విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు నిల్వలు ఆందోళనకర స్థాయికి చేరినట్లు సమాచారం.

విద్యుత్ కేంద్రాల బొగ్గు అవసరాలు:

విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్: 74 శాతం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్), రోజుకు 42 వేల టన్నుల బొగ్గు అవసరం.

రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్: 76 శాతం పీఎల్ఎఫ్, రోజుకు 28 వేల టన్నుల బొగ్గు అవసరం.కృష్ణపట్నం విద్యుత్ కేంద్రం: 69 శాతం పీఎల్ఎఫ్, రోజుకు 32 వేల టన్నుల బొగ్గు అవసరం.ప్రస్తుత నిల్వల ప్రకారం వీటీపీఎస్, ఆర్‌టీపీపీ కేంద్రాల్లో సుమారు 2.5 రోజులకు సరిపడా బొగ్గు మాత్రమే (మిగతా 2లో)

‘అంజలి పెళ్లికి మరో వేదిక చూసుకోండి’



⏭ షర్మిలకు వైఎస్ జగన్ లేఖ

టీ మీడియా, అక్టోబర్ 24, హైదరాబాద్ బ్యూరో:

మేనకోడలు అంజలి వివాహ వేడుక నిర్వహణ వేదికపై నెలకొన్న వివాదం నేపథ్యంలో వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సోదరి, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు లేఖ రాశారు. ఈ నెల 9న రాసిన ఈ లేఖను వైఎస్సార్సీపీ తాజాగా విడుదల చేసింది. అంజలి వివాహం సంతోషంగా జరగాలని ఆకాంక్షిస్తూనే, బెంగళూరులోని తన నివాసంలో పెళ్లి వేడుక నిర్వహించేందుకు జగన్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

భద్రత, వ్యక్తిగత గోప్యతపై ఆందోళన

గత ఏడేళ్లలో ఎన్నో పరిణామాలు చోటుచేసుకున్నప్పటికీ, అంజలి జీవితాంతం ప్రేమతో, సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నట్లు జగన్ లేఖలో పేర్కొన్నారు. అయితే, తాను నివసిస్తున్న బెంగళూరు ఇంట్లో వివాహ వేడుక నిర్వహించడం వల్ల వ్యక్తిగత గోప్యతతో పాటు భద్రతాపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు. ఈ విషయాన్ని (మిగతా 2లో)

రూ.10 వేల కోట్ల వ్యాపార నష్టం ముప్పు!

(మొదటి పేజీ తరువాయి)

దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొంది.ఇతర రాష్ట్రాల నుంచి ఢిల్లీకి వచ్చే వ్యాపారులు, కొనుగోలుదారులు రైల్వే స్టేషన్ల ద్వారా నగరానికి చేరుకుంటారని గుర్తుచేసింది. భారీ జనసమూహాలు, రహదారులపై ఆంక్షల కారణంగా మార్కెట్లకు చేరుకోవడం కష్టమైతే, పండుగల సమయంలో ఢిల్లీకి రావడానికి వ్యాపారులు వెనుకాడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.

ప్రజాస్వామ్య హక్కును గౌరవిస్తూనే...

శాంతియుత నిరసనలు చేపట్టడం, ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం రాజకీయ పార్టీల హక్కు అని సీటీఐ పేర్కొంది. అయితే, పండుగల సమయంలో కీలక వాణిజ్య ప్రాంతాల్లో భారీ ర్యాలీలు నిర్వహించకుండా ప్రత్యామ్నాయ తేదీలను పరిశీలించాలని కోరింది.ఇండియా కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తమ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోవాలని లేఖలో పేర్కొంది. నవంబర్ 10 తర్వాత ర్యాలీ నిర్వహిస్తే పండుగల సమయంలో వ్యాపార కార్యకలాపాలకు కలిగే అంతరాయాన్ని తగ్గించవచ్చని సీటీఐ అభిప్రాయపడింది.

ఆదాయం అంతంత.. ఖర్చులు కొండంత!

(మొదటి పేజీ తరువాయి)

సమకూరాయి. ఇది బడ్జెట్ అంచనాల్లో సుమారు 38 శాతం. పన్నుల ద్వారా రూ.1,81,367 కోట్లు వస్తాయని అంచనా వేయగా, ఇప్పటివరకు రూ.82,553 కోట్లు మాత్రమే వచ్చాయి.

పన్ను రాబడుల్లో తగ్గుదల

రాష్ట్రానికి జీఎస్టీ ద్వారా రూ.29,565 కోట్లు, అమ్మకపు పన్ను ద్వారా రూ.18,830 కోట్లు, ఎక్సైజ్ పన్నుల ద్వారా రూ.10,471 కోట్లు, స్టాంపులు--రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.9,033 కోట్లు సమకూరాయి. కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటాగా రూ.10,667 కోట్లు, ఇతర పన్నుల ద్వారా రూ.3,985 కోట్లు వచ్చాయి. ఆగస్టులో రూ.16 వేల కోట్లకు పైగా ఉన్న పన్ను ఆదాయం సెప్టెంబర్‌లో రూ.13 వేల కోట్లకు తగ్గింది.

పన్నేతర ఆదాయం.. కేంద్ర గ్రాంట్లలోనూ వెనుకబాటు

పన్నేతర ఆదాయం ద్వారా ఏడాదికి రూ.35,730 కోట్లు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది. కానీ సెప్టెంబర్ నాటికి రూ.5,754 కోట్లు మాత్రమే సమకూరాయి. సెప్టెంబర్ నెలలో ఈ ఆదాయం కేవలం రూ.278 కోట్లుగా నమోదైంది. కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో రూ.24,166 కోట్లు వస్తాయని అంచనా వేయగా, ఆరు నెలల్లో రూ.3,706 కోట్లు మాత్రమే అందాయి.

అప్పులపై ఆధారపడుతున్న ప్రభుత్వం

2026--27 ఆర్థిక సంవత్సరంలో రూ.61,457 కోట్ల అప్పులు తీసుకోవాలని బడ్జెట్‌లో ప్రతిపాదించగా, సెప్టెంబర్ నెలాఖరు నాటికే రూ.44,612 కోట్ల రుణాలు సమీకరించింది. అంటే వార్షిక అప్పుల అంచనాలో సుమారు 72.6 శాతం తొలి ఆరు నెలల్లోనే తీసుకుంది. పన్ను, పన్నేతర ఆదాయాలతో పాటు కేంద్ర గ్రాంట్లు కలిపి రాష్ట్రానికి రూ.1,36,648 కోట్ల మేర నిధులు సమకూరినట్లు నివేదికలో పేర్కొన్నారు.

ఖర్చులు భారీగా పెరుగుదల

సెప్టెంబర్ నెలాఖరు వరకు రాష్ట్ర రెవెన్యూ వ్యయం రూ.1,07,109 కోట్లకు చేరింది. మూలధన వ్యయం రూ.27,743 కోట్లుగా నమోదైంది. ఉద్యోగుల జీతాలకు రూ.25,258 కోట్లు, పింఛన్లకు రూ.14,235 కోట్లు, వడ్డీ చెల్లింపులకు రూ.16,565 కోట్లు, రాయితీలకు రూ.10,298 కోట్లు ఖర్చు చేశారు.మూలధన వ్యయం కింద సెప్టెంబర్ నెలలోనే రూ.15,251 కోట్లు వెచ్చించారు. మొత్తం ఆరు నెలల వ్యయం రూ.1,34,852 కోట్లుగా నమోదైంది. రెవెన్యూ రాబడుల కంటే రెవెన్యూ వ్యయం అధికంగా ఉండటంతో రూ.15,096 కోట్ల రెవెన్యూ లోటు ఏర్పడింది. ఆర్థిక లోటు రూ.44,612 కోట్లుగా, ప్రాథమిక లోటు రూ.28,046 కోట్లుగా నమోదైనట్లు కాగ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ఆదాయం పెంపుపై దృష్టి అవసరం

రాష్ట్ర ప్రభుత్వానికి పన్ను రాబడులు పెంచడం, పన్నేతర ఆదాయ వనరులను మెరుగుపరచడం, కేంద్ర గ్రాంట్లను సమర్థంగా సమీకరించడం కీలకంగా మారాయి. అదే సమయంలో ఖర్చుల ప్రాధాన్యతను నిర్ణయిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అవసరమైన నిధులు సమకూరేలా ఆర్థిక నిర్వహణ చేపట్టాల్సిన అవసరం ఉంది.

ధర బాగానే ఉంది.. దిగుబడే లేదు

(మొదటి పేజీ తరువాయి)

పలికినట్లు సమాచారం.అయితే, ఎకరాకు ఐదు క్వింటాళ్ల దిగుబడి వస్తే మొత్తం ఆదాయం సుమారు రూ.46,250 మాత్రమే ఉంటుంది. ఇందులో సాగు పెట్టుబడితో పాటు కూలీల ఖర్చులు, రవాణా, కమీషన్ తదితర వ్యయాలు పోను రైతుకు మిగిలేది స్వల్ప మొత్తమే. పెట్టుబడి కూడా పూర్తిగా తిరిగి రాని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి

ఉమ్మడి కరీంనగర్ ప్రాంతంలోని మార్కెట్లలో పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతున్నాయి. దిగుబడులు తగ్గడంతో మార్కెట్‌లో పత్తికి డిమాండ్ పెరిగినప్పటికీ, రైతులకు ఆశించిన ఆర్థిక ప్రయోజనం దక్కడం లేదు.ధరలు బాగున్నా పంట చేతికందకపోతే రైతులకు ప్రయోజనం ఏమిటని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు. వర్షాభావం కారణంగా దిగుబడి కోల్పోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టాలను అంచనా వేసి తగిన సహాయం అందించాలని వారు కోరుతున్నారు.

'అంజలి పెళ్లికి మరో వేదిక చూసుకోండి'

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే పలువురి ద్వారా తెలియజేసినప్పటికీ, అదే వేదికపై వేడుక నిర్వహించాలని పట్టుబట్టడం తనకు బాధ కలిగించిందని పేర్కొన్నారు.

ఫొటోలు, వీడియోలతో భద్రతకు ముప్పు

వివాహ వేడుకల నిర్వహణలో భాగంగా ఈవెంట్ మేనేజ్‌మెంట్, క్యాటరింగ్, డెకరేషన్ సిబ్బందితో పాటు ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు, పెద్ద సంఖ్యలో అతిథులు నివాసంలోకి వస్తారని జగన్ వివరించారు. ఈ క్రమంలో ఇంటి అంతర్గత దృశ్యాలు, పరిసర ప్రాంతాల ఫొటోలు, వీడియోలు బయటకు వెళ్లి సామాజిక మాధ్యమాల్లో ప్రచారమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇవి తన భద్రతకు ముప్పుగా మారవచ్చని లేఖలో పేర్కొన్నట్లు సమాచారం.

ప్రత్యామ్నాయ వేదికను ఎంచుకోవాలని సూచన

తన పిల్లల వివాహమైనా ఇలాంటి నిర్ణయమే తీసుకునేవాడినని జగన్ స్పష్టం చేశారు. బెంగళూరు నివాసానికి బదులుగా కన్వెన్షన్ సెంటర్ లేదా డెస్టినేషన్ వెడ్డింగ్ వేదికను ఎంచుకోవాలని సూచించారు. గతంలో షర్మిల కుమారుడు రాజా వివాహానికి చేసినట్లుగానే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అవసరమైతే హైదరాబాద్‌లోని లోటస్ పాండ్ నివాసాన్ని వివాహ వేడుకల కోసం ఉపయోగించుకోవచ్చని లేఖలో స్పష్టం చేశారు.

కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం..

⏭ దంపతులు మృతి

టీ మీడియా , అక్టోబర్ 24 ,నారాయణఖేడ్:

కర్ణాటక రాష్ట్రం బసవకళ్యాణ్ సమీపంలోని ఇర్కోడ్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందారు. ఈ ఘటనతో మనూరు మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి.మనూరు మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్, పీఏసీఎస్ డైరెక్టర్ సంగమణి (45), ఆమె భర్త, రేషన్ డీలర్ సంజీవులు (50) కుటుంబ సభ్యులతో కలిసి కారులో మనూరు నుంచి తుల్జాపూర్ ఆలయానికి బయలుదేరారు. ఈ క్రమంలో ఇర్కోడ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సంగమణి, సంజీవులు ప్రాణాలు కోల్పోయారు.ప్రమాదంలో వారి కుటుంబ



సభ్యులు కోడలు మమత, కుమారుడు సురేష్, వెంకట్, మనుమడు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. క్షతగాత్రులను బీదర్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. దంపతుల మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

విద్యుత్ ఉత్పత్తికి బొగ్గు కొరత!

(మొదటి పేజీ తరువాయి)

ఉండగా, కృష్ణపట్నం కేంద్రంలో 1.3 రోజులకు సరిపడా నిల్వలు ఉన్నట్లు సమాచారం. దీంతో బొగ్గు సరఫరా సకాలంలో జరగకపోతే విద్యుత్ ఉత్పత్తికి ఆటంకాలు ఏర్పడే అవకాశం ఉంది.

బొగ్గు సరఫరాపై కేంద్రం దృష్టి

దేశవ్యాప్తంగా బొగ్గు సరఫరాను పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం బొగ్గు, రైల్వే, విద్యుత్ మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులతో ఉపకమిటీని ఏర్పాటు చేసింది. అయినప్పటికీ, విద్యుత్ డిమాండ్‌కు తగిన స్థాయిలో బొగ్గు కేటాయింపులు జరగడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

దిగుమతి బొగ్గుతో గట్టెక్కే ప్రయత్నం

బొగ్గు కొరతను అధిగమించేందుకు జెన్‌కో ప్రత్యామ్నాయ చర్యలకు సిద్ధమైంది. మూడు లక్షల టన్నుల దిగుమతి బొగ్గును సేకరించాలని నిర్ణయించినట్లు జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ నాగలక్ష్మి వెల్లడించారు. ప్రస్తుతం దిగుమతి బొగ్గు టన్ను ధర సుమారు రూ.19 వేలుగా ఉందని, అందువల్ల అత్యవసర అవసరాలకు మాత్రమే కొనుగోలు చేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు, ఏపీ పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ నిర్వహిస్తున్న కృష్ణపట్నం ప్లాంట్ కోసం ఇప్పటికే ఐదు లక్షల టన్నుల దిగుమతి బొగ్గును సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో రెండు లక్షల టన్నులు చేరగా, మిగిలిన మూడు లక్షల టన్నులు వచ్చే నెలలోగా అందనున్నట్లు వివరించారు. అదనంగా సింగరేణి కాలరీస్ వారానికి ఒక రేక్ బొగ్గును సరఫరా చేసేందుకు అంగీకరించినట్లు తెలిపారు.

ముందస్తు చర్యలే కీలకం

విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న సమయంలో బొగ్గు నిల్వలు తగ్గిపోవడం విద్యుత్ రంగానికి సవాలుగా మారింది. దిగుమతి బొగ్గు, దేశీయ బొగ్గు సరఫరాను సమన్వయం చేయడంతోపాటు థర్మల్ కేంద్రాల్లో కనీస నిల్వలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేకపోతే రానున్న రోజుల్లో విద్యుత్ ఉత్పత్తిపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉంది.

ఎన్‌హెచ్ఏఐ రోడ్డు పనుల్లో నాణ్యతకు తూట్లు!

⏭ పోనేకల్- కొరివి హైవే నిర్మాణంపై ఆరోపణలు.!

టీ మీడియా , అక్టోబర్ 24, ఖమ్మం రూరల్:

ప్రజల ప్రయాణాన్ని సురక్షితం చేయాల్సిన జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలపై ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. పోనేకల్–కొరివి హైవే నిర్మాణ పనుల్లో భాగంగా అరకోడు పరిసర ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు, నిర్మాణ సామగ్రి వినియోగం, రోడ్డు నిర్మాణ పద్ధతులపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రాళ్లపై మట్టి పోసి రోడ్డు నిర్మిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

గ్రావెల్‌కు బదులు రాళ్లు

హైవే నిర్మాణంలో రోడ్డు పటిష్టత, దీర్ఘకాలిక మన్నికకు అనుగుణంగా నిర్దేశిత సాంకేతిక ప్రమాణాలు పాటించాలి. అయితే అరకోడు పరిసరాల్లో జరుగుతున్న పనుల్లో గ్రావెల్ వేయాల్సిన చోట రాళ్లు వేసి, వాటిపై మట్టి పోస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? నిర్మాణానికి ఉపయోగిస్తున్న పదార్థాలు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.రోడ్డు నిర్మాణంలో ఉపయోగించే మట్టి, గ్రావెల్, ఇతర నిర్మాణ సామగ్రి నాణ్యతను పరీక్షించడంతోపాటు, పొరల వారీగా సరైన సాంద్రత వచ్చేలా పనులు చేపట్టాలి. అవసరమైన సాంకేతిక పరీక్షలు నిర్వహించి, వాటి ఫలితాల ఆధారంగా నిర్మాణ నాణ్యతను నిర్ధారించాలి. ఈ ప్రక్రియలో నిర్లక్ష్యం జరిగితే రోడ్డు మన్నిక దెబ్బతినే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యతా పరీక్షలు ఎవరి ఆధ్వర్యంలో?

నిర్మాణ పనుల్లో నాణ్యతను నిర్ధారించేందుకు



కాంట్రాక్టర్ నిర్వహించే అంతర్గత పరీక్షలతోపాటు, ఒప్పంద నిబంధనల ప్రకారం స్వతంత్ర తనిఖీలు, సంబంధిత అధికారుల ధ్రువీకరణ కూడా కీలకం. అయితే నాణ్యతా పరీక్షలను కాంట్రాక్టర్లే నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో పరీక్షల విధానం, వాటి ఫలితాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.నిర్మాణంలో ఉపయోగిస్తున్న మట్టి, గ్రావెల్ నాణ్యతను ఏ విధంగా పరీక్షిస్తున్నారు? పరీక్షలు ఎక్కడ నిర్వహిస్తున్నారు? వాటి నివేదికలను సంబంధిత అధికారులు పరిశీలిస్తున్నారా? క్షేత్రస్థాయి తనిఖీల ఆధారంగా పనులకు అనుమతులు ఇస్తున్నారా? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇవ్వాలి. పరీక్షల నివేదికలు, తనిఖీల వివరాలు పారదర్శకంగా వెల్లడిస్తే ప్రజల్లో నెలకొన్న అనుమానాలకు సమాధానం లభిస్తుంది.

ఎన్‌హెచ్ఏఐ అధికారుల పర్యవేక్షణ ఏది?

జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో నిర్దేశిత ప్రమాణాలు పాటించేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. నిర్మాణ సామగ్రి నాణ్యత, మట్టి పొరల ఏర్పాటు, సాంద్రత పరీక్షలు, పనుల పురోగతి వంటి అంశాలను సాంకేతిక నిపుణుల ద్వారా పర్యవేక్షించాలి. లోపాలు గుర్తించినప్పుడు వాటిని సరిదిద్దించి, ఒప్పంద నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.పోనేకల్--కొరివి హైవే పనులపై వస్తున్న ఆరోపణలను సంబంధిత ఎన్‌హెచ్ఏఐ అధికారులు పరిశీలించి, వాస్తవ పరిస్థితులను వెల్లడించాల్సిన అవసరం ఉంది. కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నప్పటికీ, వాటిపై స్వతంత్రంగా విచారణ జరిపి ఆధారాలతో నిజానిజాలు నిర్ధారించాలి.

ప్రజాధనానికి రక్షణ కల్పించాలి

ప్రజల సౌకర్యం, భద్రత కోసం ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించి జాతీయ రహదారులను నిర్మిస్తోంది. అలాంటి పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడితే చివరికి నష్టపోయేది ప్రజలే. నిర్మాణ దశలోనే లోపాలు ఉంటే భవిష్యత్తులో రోడ్డు దెబ్బతినడం, మరమ్మతుల భారం పెరగడం, ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. పోనేకల్--కొరివి హైవే నిర్మాణ పనులపై ఉన్న ఆరోపణలను ఉన్నతాధికారులు తక్షణమే పరిశీలించాలి. అరకోడు పరిసరాల్లో మట్టి తవ్వకాలు, నిర్మాణ సామగ్రి వినియోగం, పనుల నాణ్యతపై క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించాలి. నాణ్యతా పరీక్షల నివేదికలను పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా పనులు జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలి.

ఎంపీఓకు సీఐటీయూ వినతిపత్రం

⏭ 26న ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా

టీ మీడియా, అక్టోబర్ 24, ముదిగొండ:

కార్మికులు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 26న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం ముదిగొండ మండల ఎంపీఓ రామకృష్ణకు సీఐటీయూ మండల నాయకులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. కార్మికులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ మహా ధర్నాకు మండలంలోని కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు రవి, పల్లపాటి శ్రీకాంత్, ఉపేందర్, నాగేశ్వరరావు, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

⏭ డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు

టీ మీడియా, అక్టోబర్ 24, ముదిగొండ:

వీబీ జీ రామ్ జీ పథకం కింద కూలీల సంఖ్యను పెంచి, వారికి విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించాలని ఖమ్మం జిల్లా డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. ముదిగొండ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీబీ జీ రామ్ జీ క్షేత్ర సహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రస్తుతం ఎల్‌నీనో ప్రభావంతో ఏర్పడే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కూలీలకు ఉపాధి కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. రైతులకు అండగా నిలవడంతో పాటు, ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత నిర్మాణాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పనులకు అవసరమైన సంఖ్యలో కూలీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని



సూచించారు.కూలీలకు పని కల్పించే విషయంలో అధికారులు, క్షేత్ర సహాయకులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయ, మండల పంచాయతీ అధికారి రామకృష్ణ, సహాయ పథక అధికారి రంగనాయకమ్మతో పాటు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత



⏭ డిప్యూటీ సీఎం

మల్లు భట్టి విక్రమార్క

టీ మీడియా ,అక్టోబర్ 24 ,చింతకాని:

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. గ్రామాల్లో రహదారులు, విద్యుత్, తాగునీటి సదుపాయాలను మెరుగుపరుస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలంలో శనివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటించారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, పూర్తయిన పనులను ప్రారంభించారు.

రూ.125 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శ్రీకారం

చింతకాని మండలం పొద్దుటూరు గ్రామంలో రూ.3.5 కోట్లతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు, తిమ్మినేనిపాలెం గ్రామంలో రూ.8.25 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.రామకృష్ణాపురం నుంచి కొత్తగూడెం మీదుగా దేవరపల్లి హైవేను కలిపే మార్గంలో రూ.3 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు, రామకృష్ణాపురం నుంచి పెద్దగోపతి రోడ్డు వరకు రూ.50 కోట్లతో చేపట్టనున్న రహదారి విస్తరణ, బలోపేతం పనులకు శ్రీకారం చుట్టారు.అలాగే కొదుమూరు గ్రామంలో వెంకటపాలెం నుంచి చింతకాని రోడ్డు వరకు రూ.60 కోట్లతో నాలుగు వరుసల రహదారిగా విస్తరించి, బలోపేతం చేసే పనులకు శంకుస్థాపన చేశారు.పూర్తయిన సీసీ రోడ్లు ప్రారంభంతిమ్మినేనిపాలెం ఎస్సీ కాలనీలో రూ.62 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను, గాంధీనగర్ ఎస్సీ కాలనీలో రూ.46 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును డిప్యూటీ సీఎం ప్రారంభించారు.

గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రాభివృద్ధి

ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు.గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు రహదారుల నిర్మాణం, విస్తరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. నాణ్యమైన రహదారుల నిర్మాణంతో గ్రామాల మధ్య రాకపోకలు సులభతరమవుతాయని, ప్రజలకు రవాణా పరంగా ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు.ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణంతో పరిసర గ్రామాలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. గ్రామీణ ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన పంపిణీ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి

అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. పనుల పురోగతిని సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అభివృద్ధి పనుల ప్రయోజనాలు ప్రజలకు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కొదుమూరు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ వేముల సతీష్, ప్రజాప్రతినిధులు, సంబంధిత జిల్లా అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి మృతి



టీ మీడియా, అక్టోబర్ 24, పెబ్బేరు:

వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్ని రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. గతంలో ఆమె వనపర్తిలోని ఉర్దూ మీడియం పాఠశాలలో పనిచేశారు.విజయలక్ష్మి మృతికి సంతాపం తెలిపిన జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) యాదయ్య, ఆమె భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె భర్త, ఉపాధ్యాయుడు సిద్ధి రవిని పరామర్శించి మనోధైర్యంతో ఉండాలని సూచించారు.ఉపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు విజయలక్ష్మికి నివాళులర్పించి తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఆమె భౌతికకాయాన్ని స్వగ్రామమైన సంగినాపల్లికి తరలించారు.

పలువురిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



టీ మీడియా ,అక్టోబర్ 24 , నారాయణఖేడ్:

పెద్ద శంకరంపేట పట్టణానికి చెందిన ప్రకాశం సేట్, సిద్ధు సేట్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటికి చేరుకున్న విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.అదేవిధంగా, శంకరంపేట (ఆ) మండలం బద్దారం గ్రామానికి చెందిన ధోబ్బ బేతయ్య ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకుని ఆయన నివాసానికి వెళ్లారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు.ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రమేష్, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సురేష్ గౌడ్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, సర్పంచ్ కోణం అంజయ్య, మాజీ ఎంపీటీసీ దత్తు, మాజీ సర్పంచులు నరసింహులు సేట్, శంకర్ గౌడ్, విట్టల్ గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, మల్లేశం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్‌కు ఉచిత ఎంబీబీఎస్ సీటు.. మహేష్‌కు వెటర్నరీలో సీటు





⏭ విద్యార్థులను ఘనంగా

సత్కరించిన కాంగ్రెస్ నాయకులు

టీ మీడియా, అక్టోబర్ 24, ముదిగొండ:

మండల కేంద్రం ముదిగొండకు చెందిన ఇద్దరు విద్యార్థులు నీట్ ఫలితాల్లో ప్రతిభ చాటి ఉచిత సీట్లు సాధించారు. పందిరి ఆనంద్ ఎంబీబీఎస్ సీటు సాధించగా, బోడ మహేష్ పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీలో సీటు సంపాదించారు. విద్యార్థులు సాధించిన ఈ విజయాల పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆనంద్‌కు ఉచిత ఎంబీబీఎస్ సీటు

ముదిగొండకు చెందిన పందిరి మల్లికార్జున్, లక్ష్మి దంపతుల కుమారుడు పందిరి ఆనంద్ 2026 నీట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి ఉచిత ఎంబీబీఎస్ సీటు సాధించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన స్వగృహంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనంద్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు.

మహేష్‌కు వెటర్నరీ యూనివర్సిటీలో సీటు

మండల కేంద్రానికి చెందిన బోడ వాల్య, పద్మ దంపతుల కుమారుడు బోడ మహేష్ 2026 నీట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీలో ఉచిత సీటు సాధించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయన ఇంటికి వెళ్లి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు నాయకుల అభినందనలు

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆనంద్, మహేష్ కష్టపడి చదివి ఉన్నత విద్యలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ముదిగొండ గ్రామానికి, తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత చదువులకు అవసరమైన సహాయం కావాలన్నా తమను సంప్రదించాలని విద్యార్థులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ముదిగొండ గ్రామ కాంగ్రెస్ పార్టీ శాఖ అధ్యక్షుడు సామినేని నాగేశ్వరరావు, మండల ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు ఉసికల రమేష్, శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ చైర్మన్ కొమ్ము నరసింహారావు, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు మందరపు ఉపేందర్‌రావు, బాలాజీ, మాదాల శ్రీనివాస్, బలంతు వెంకట్, వేల్పుల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు ఆలయ చైర్మన్ శుభాకాంక్షలు

టీ మీడియా, అక్టోబర్ 24, ముదిగొండ:

తహశీల్దార్ రవికుమార్‌ను శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ చైర్మన్ కొమ్ము నరసింహారావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ కార్యకలాపాలు, దేవస్థానంలో భక్తులకు కల్పిస్తున్న వసతులు, రానున్న ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించిన పలు అంశాలపై ఇరువురూ చర్చించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



ఉచితంగా పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాలు



⏭ ఏడు క్లస్టర్లలో ఏర్పాటు

టీ మీడియా, అక్టోబర్ 24, సింగరేణి (కారేపల్లి):

ఖమ్మం–వరంగల్–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో మండలవ్యాప్తంగా ఏడు క్లస్టర్లలో ఉచిత ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు ప్రారంభించారు.ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి గెలుపే లక్ష్యంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో కాంగ్రెస్ శ్రేణులు కృషి చేస్తున్నాయని తెలిపారు.ఇందులో భాగంగా సింగరేణి మండలంలోని చీమలపాడు, మాణిక్యారం, సీతారాంపురం, భాగ్యనగర్, సింగరేణి, మాదారం, గేట్ కారేపల్లి ప్రాంతాల్లో ఉచిత ఓటరు నమోదు కేంద్రాలను ప్రారంభించినట్లు వెల్లడించారు.అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పేర్లను ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఓటరు నమోదు ప్రక్రియకు 2026 నవంబర్ 6 చివరి తేదీ కావడంతో అర్హులైన వారంతా ఆలస్యం చేయకుండా నమోదు చేసుకొని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సింగరేణి సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ), జిల్లా నాయకులు గుగులోత్ భీముడు, కడియాల సుధాకర్, అజ్మీర నరేష్, సురేందర్, ఈర్య, వాంకుడోత్ గాంధీ, ఏసు, నాగవేణి, షఫీ తదితరులు పాల్గొన్నారు.

బైక్ స్టంట్లు చేస్తే చర్యలు తప్పవు



⏭ సీఐ ముష్క రాజు

టీ మీడియా, అక్టోబర్ 24, అక్టోబర్ 24, ఖమ్మం రూరల్:

రోడ్లపై ప్రమాదకర బైక్ స్టంట్లు చేస్తూ ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగించే యువతపై ఖమ్మం రూరల్ పోలీసులు నిఘా పెంచారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు బైక్ విన్యాసాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఖమ్మం రూరల్ సీఐ ముష్క రాజు తెలిపారు.ఈ క్రమంలో ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థి ఐతగాని అజయ్‌కుమార్ (20)పై శనివారం కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.రోడ్లు ప్రజలందరి ప్రయాణానికి ఉద్దేశించినవని, వాటిపై ప్రమాదకర విన్యాసాలు చేస్తూ ఇతర వాహనదారులు, పాదచారుల భద్రతకు ముప్పు కలిగించడం సరికాదని సీఐ పేర్కొన్నారు. బైక్ స్టంట్లపై నిఘా విభాగంతో పాటు పోలీస్ శాఖలోని వివిధ విభాగాలు పర్యవేక్షణ చేపట్టినట్లు తెలిపారు.ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రమాదకరంగా బైక్ విన్యాసాలు చేస్తూ పట్టుబడితే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షణిక సరదా కోసం యువత తమ ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని, రోడ్డుపై ప్రయాణించే ఇతరుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు.బైక్ స్టంట్లను ప్రోత్సహించడం, రహదారులను విన్యాసాలకు వేదికలుగా మార్చడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సీఐ ముష్క రాజు స్పష్టం చేశారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే చర్యలపై పోలీసుల నిఘా కొనసాగుతుందని తెలిపారు.

ఉచితంగా నీమ్ ఆయిల్, నానో యూరియా



⏭ సేంద్రియ వ్యవసాయంపై అవగాహన లక్ష్యం

టీ మీడియా, అక్టోబర్ 24, చింతూరు:

పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడంతో పాటు రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించే లక్ష్యంతో పీపుల్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పోలవరం జిల్లా చింతూరు మండలం శుద్ధగూడెం గ్రామంలో రైతులకు ఉచితంగా నీమ్ ఆయిల్ (వేప నూనె), నానో యూరియాను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సంస్థ కోఆర్డినేటర్ ముమ్మడి అశోక్ మాట్లాడుతూ.. రైతులు రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి, పర్యావరణానికి మేలు చేసే వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రకృతికి అనుకూలమైన సాగు విధానాలను ప్రోత్సహించడంలో భాగంగానే రైతులకు ఉచితంగా నీమ్ ఆయిల్, నానో యూరియాను అందించినట్లు తెలిపారు.రైతులు ఆధునిక వ్యవసాయ సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే ప్రకృతి అనుకూల పద్ధతులను అవలంబించాలని ఆయన కోరారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, పంటల దిగుబడిని మెరుగుపరుచుకునేందుకు సమతుల్య ఎరువుల వినియోగం, పర్యావరణహిత సాగు విధానాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు

పొలంలో భారీ కొండచిలువ కలకలం

⏭ భయాందోళనకు గురైన రైతులు

టీ మీడియా , అక్టోబర్ 24 , కూసుమంచి:

ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నేలపట్ల గ్రామంలో వరి పంట పొలంలో భారీ కొండచిలువ ప్రత్యక్షమై రైతులను భయాందోళనకు గురిచేసింది. శనివారం గ్రామానికి చెందిన రైతు అలవాల లింగయ్య తన వరి పొలంలో పంట కోస్తుండగా సుమారు 10 నుంచి 12 అడుగుల పొడవున్న కొండచిలువ కనిపించింది.ఊహించని విధంగా భారీ కొండచిలువ కనిపించడంతో భయపడిన రైతు వెంటనే స్థానికులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న రైతులు కొండచిలువను చూసి ఆందోళనకు గురయ్యారు. అనంతరం స్థానికులు కొండచిలువను హతమార్చినట్లు తెలిసింది.



రైతులు అప్రమత్తంగా ఉండాలి

వరి కోతల సమయంలో పంట పొలాల్లో పాములు కనిపించే అవకాశం ఉన్నందున రైతులు, వ్యవసాయ కూలీలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పంట కోసే సమయంలో పొలంలోని పరిసరాలను జాగ్రత్తగా గమనించాలని, పాములు కనిపిస్తే వాటిని చంపకుండా అటవీ శాఖ లేదా పాములను సురక్షితంగా పట్టుకునే శిక్షణ పొందిన నిపుణులకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు.

ధాన్యం ధర ఆల్‌టైమ్ రికార్డు



⏭ ఏకంగా క్వింటా రూ.5,016!

టీ మీడియా, అక్టోబర్ 24, మహబూబాబాద్:

తెలంగాణలో ధాన్యం ధరలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో జై శ్రీరామ్ రకం ధాన్యం క్వింటాకు ఏకంగా రూ.5,016 ధర పలికింది. అలాగే ఆర్ఎన్ఆర్ రకం ధాన్యం క్వింటాకు రూ.4,200 ధర నమోదైంది. దీంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

మద్దతు ధర కంటే అధికంగా ధరలు

ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరతో పోలిస్తే కొన్ని రకాల ధాన్యానికి మార్కెట్‌లో అధిక ధరలు లభిస్తున్నాయి. సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.2,461, దొడ్డు రకానికి రూ.2,441 కనీస మద్దతు ధరగా ఉండగా, అదనంగా రూ.500 బోనస్ కూడా ప్రకటించారు. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో లభిస్తున్న ధరలు రైతులకు ఊరటనిస్తున్నాయి.

బియ్యం ధరలపైనా ప్రభావం?


ధాన్యం ధరలు పెరగడంతో రాబోయే రోజుల్లో బియ్యం ధరలపైనా ప్రభావం పడే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో జై శ్రీరామ్ బియ్యం క్వింటాకు రూ.8,000 నుంచి రూ.9,000 వరకు పలుకుతోంది. ధాన్యం కొనుగోలు ధరలు మరింత పెరిగితే బియ్యం ధరలు కూడా పెరిగే అవకాశం ఉంది.మరోవైపు, ఎల్‌నినో ప్రభావం కారణంగా ధాన్యం ధరలు పెరుగుతున్నాయనే ప్రచారం ఉన్నప్పటికీ, ధరల పెరుగుదలకు అసలు కారణాలను నిర్ధారించేందుకు మార్కెట్ సరఫరా, డిమాండ్, దిగుబడి వంటి అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. మొత్తంగా కేసముద్రం మార్కెట్‌లో నమోదవుతున్న ధరలు రైతులు, వినియోగదారుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

భీమా కాల్వలకు నీరు విడుదల చేయాలి

⏭ బీజేపీ కొల్లాపూర్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు

టీ మీడియా, అక్టోబర్ 24, వీపనగండ్ల, :

సాగునీరు అందక భీమా కాల్వల(పరిధిలో వరి పంటలుగ్రుఘనఎఎ ఎతీశీజూం) ఎండిపోతుండటంతో రైతులు(ఖీుతీఎవతీం) తీవ్ర ఆందోళన చెందుతున్నారని బీజేపీ కొల్లాపూర్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. రైతన్నకు భరోసా కార్యక్రమంలో భాగంగా రెండో రోజు మండల పరిధిలోని వీపనగండ్ల, సంగినేనిపల్లి, కల్వరాల గ్రామాల్లో పర్యటించి ఎండిపోతున్న వరి పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీరు అందక కళ్ల ముందే పంటలు ఎండిపోతుంటే రైతులు కన్నీరుమున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భీమా, జూరాల కాల్వల ద్వారా సాగునీరు అందకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు.



కరువు మండలంగా ప్రకటించాలి

⏭ పంటలను పరిశీలించిన సీపీఎం బృందం

టీ మీడియా, అక్టోబర్ 24, పెబ్బేరు:

వనపర్తి జిల్లా పెబ్బేరు మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గుమ్మడం, గుమ్మడం తండా, చిన్న గుమ్మడం గ్రామాల్లో డి-29 కాలువ కింద సాగు చేసిన వరి తదితర పంటలను సీపీఎం ప్రతినిధి బృందం పరిశీలించింది .డి-29 కాలువ ద్వారా చివరి ఆయకట్టుకు సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని నాయకులు తెలిపారు. ఇప్పటికే 50 ఎకరాలకు పైగా వరి, మినుములు, వేరుశనగ పంటలు నీరు అందక పూర్తిగా ఎండిపోయాయని పేర్కొన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మరో 500 ఎకరాల్లో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని, ఎండిపోయే స్థితిలో ఉన్న పంటలను కాపాడేందుకు వెంటనే సాగునీటిని విడుదల చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సంబంధిత ప్రభుత్వ అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.పెబ్బేరు మండలంలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టి పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం. వెంకటస్వామి, ఆర్. భాస్కర్, ఆర్. దేవన్న, పంటలు ఎండిపోయిన రైతులు వెంకటస్వామి, గుమ్మడం తండా సర్పంచ్ హనుమంతు నాయక్, నరసింహ, బాలస్వామి, గజ్జలయ్య, బుచ్చన్న, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కనీస వేతనాల అమలుకై 26న చలో హైదరాబాద్

⏭ లేబర్ కోడ్‌లతో కార్మిక హక్కులకు ముప్పు: సీఐటీయూ

టీ మీడియా, అక్టోబర్ 24, సింగరేణి (కారేపల్లి):

పల్లెల్లో వైద్య సేవలు అందిస్తూ, ఆరోగ్య సర్వేలు నిర్వహిస్తూ ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్న ఆరోగ్య కార్యకర్తలకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం బాధాకరమని సీఐటీయూ జిల్లా నాయకురాలు ఎల్లబోయిన రాధ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. హెల్త్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం మండల వైద్యాధికారి సురేష్‌కు నాయకులు, కార్మికులు వినతిపత్రం అందజేశారు.పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను నిర్ణయించి పకడ్బందీగా అమలు చేయాలని, కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి తగిన వేతనాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, ఐకేపీ, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామపంచాయతీ, భవన నిర్మాణ, హమాలీ, ఆర్టీసీ, సింగరేణి, విద్యుత్ తదితర రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు పెంచుతామని ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలులో కాలయాపన చేస్తోందని విమర్శించారు.కనీస వేతన చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడంతో పాటు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 26న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆందోళనను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జంగా కళ్యాణి, వాంకుడోత్ కమల, జీపీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు శాతరాజుపల్లి నాగేశ్వరరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల కార్యదర్శి ఎస్.నాగమణి, ఎం.కుమారి, జి.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



సింగరేణిలో మళ్లీ సిండికేట్ చర్చ

⏭ విడిపోయిన దుకాణాలను ఏకం చేసే ప్రయత్నాలు

⏭ గ్రామాలకు భారీగా మద్యం తరలింపులపై అనుమానాలు

టీ మీడియా, అక్టోబర్ 24, సింగరేణి (కారేపల్లి):

ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో మద్యం వ్యాపారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. గతంలో నాలుగు మద్యం దుకాణాలు సిండికేట్‌గా ఏర్పడి, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయించాయనే ఆరోపణలు వినిపించగా, ఆ తర్వాత వ్యాపారుల మధ్య విభేదాలతో సిండికేట్ విడిపోయినట్లు స్థానికంగా ప్రచారం జరిగింది. తాజాగా ఆ నాలుగు దుకాణాలను తిరిగి ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం మద్యం వ్యాపార వర్గాల్లో కలకలం రేపుతోంది.మరోవైపు గ్రామాలు, పల్లెల్లోని బెల్ట్ షాపులకు పెద్ద మొత్తంలో మద్యం సరఫరా అవుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోల ద్వారా మద్యం తరలిస్తున్నారనే స్థానికుల అనుమానాల నేపథ్యంలో ఈ సరఫరాలపై ఎక్సైజ్ శాఖ నిఘా ఎంతవరకు ఉందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.

విడిపోయిన సిండికేట్ మళ్లీ ఒక్కటవుతోందా?

గతంలో నాలుగు మద్యం దుకాణాల వ్యాపారులు సమన్వయంతో వ్యాపారం సాగించినట్లు స్థానికంగా ప్రచారం ఉంది. అనంతరం వ్యాపారుల మధ్య విభేదాలు తలెత్తడంతో వారు విడిపోయినట్లు సమాచారం. ప్రస్తుతం తిరిగి వారిని ఒక్కతాటిపైకి తీసుకువచ్చేందుకు ఓ శాఖకు చెందిన అధికారి ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యాపారులతో సంప్రదింపులు జరుపుతూ సిండికేట్ ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. అయితే సంబంధిత అధికారి పాత్రపై ఎలాంటి అధికారిక నిర్ధారణ లేదు. ఈ ప్రచారంలో వాస్తవమెంత? వ్యాపారుల మధ్య సాధారణ చర్చలేనా? లేక నిజంగానే సమన్వయ ప్రయత్నాలు జరుగుతున్నాయా? అన్నది ఉన్నతాధికారుల విచారణతోనే స్పష్టమవుతుంది.

బెల్ట్ షాపులకు ముందస్తుగా మద్యం నిల్వలా?

సింగరేణి మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు మద్యం తరలింపులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దుకాణాల నుంచి ఆటోలు, ద్విచక్ర వాహనాల ద్వారా మద్యం తీసుకెళ్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో, ఆ సరుకు ఎక్కడికి చేరుతోంది? వ్యక్తిగత వినియోగానికా? లేక బెల్ట్ షాపుల్లో విక్రయించేందుకా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.ఒకేసారి పెద్ద మొత్తంలో మద్యం కొనుగోలు చేస్తున్నవారి వివరాలను పరిశీలించడం, సరుకు తరలింపుల గమ్యస్థానాలను గుర్తించడం, అవసరమైన చోట తనిఖీలు నిర్వహించడం ద్వారా వాస్తవాలను వెలికితీయవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సాధారణ వ్యాపార లావాదేవీలను అక్రమ సరఫరాగా పరిగణించకుండా, ఆధారాల ఆధారంగా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

సిండికేట్ వెనుక అధికారుల పాత్ర ఉందా?

అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాల్సిన శాఖకు చెందిన అధికారే వ్యాపారులను ఏకం చేసేందుకు ప్రయత్నిస్తున్నారనే ప్రచారం నిజమైతే, అది తీవ్ర విచారణకు అర్హమైన అంశం. అయితే ప్రచారాన్ని మాత్రమే ఆధారంగా చేసుకుని ఎవరిపైనా నిర్ధారణకు రావడం సరికాదు.

గతంలో విడిపోయిన నాలుగు మద్యం దుకాణాల వ్యాపారులను తిరిగి ఏకం చేసేందుకు ఎవరైనా ప్రయత్నిస్తున్నారా? ఈ వ్యవహారంలో అధికారుల పాత్ర ఏమైనా ఉందా? వ్యాపారుల మధ్య జరిగిన సంప్రదింపుల వెనుక ఉద్దేశం ఏమిటి? అనే అంశాలపై జిల్లా ఎక్సైజ్ ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని స్థానికంగా డిమాండ్ వినిపిస్తోంది.



గిరిజన బాలికల పాఠశాలలో కలకలం



- **కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు**

టీ మీడియా, అక్టోబర్ 24, ఇల్లెందు:
విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, వారి భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన గురువుపైనే లైంగిక వేధింపుల ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం రొంపేడు గిరిజన బాలికల పాఠశాలలో కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడిపై ఓ మైనర్ బాలిక పట్ల లైంగిక దాడికి యత్నించినట్లు ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్యూషన్ పేరుతో పిలిచి.

దసరా సెలవుల సమయంలో ట్యూషన్ పేరుతో బాలికను తన ఇంటికి పిలిచి లైంగిక దాడికి యత్నించినట్లు సదరు ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు అందినట్లు సమాచారం. అంతేకాకుండా సెలవు రోజుల్లోనూ అనుచిత సందేశాలు పంపాలని ఒత్తిడి చేస్తూ, ఈ విషయం బయటపెడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బాలికను బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో హాస్టల్ అటెండర్ పాత్రపైనా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే ఈ ఆరోపణలపై దర్యాప్తులో వాస్తవాలు తేలాల్సి ఉంది.

పోలీసులకు ఫిర్యాదు.. పోక్సో కేసు నమోదు

తనకు ఎదురైన పరిస్థితిని బాలిక కుటుంబ సభ్యులకు వివరించడంతో వారు ఈ నెల 18న ఇల్లెందు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది.మరోవైపు, పాఠశాల పునఃప్రారంభమైన రోజున గిరిజన సంక్షేమ శాఖకు చెందిన సంబంధిత అధికారి పాఠశాలను సందర్శించి ఘటనపై విచారణ చేపట్టినట్లు సమాచారం. సమగ్ర విచారణ అనంతరం బాధ్యులపై చర్యలకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని అధికారి వెల్లడించినట్లు తెలిసింది.

బాలికల భద్రతకు భరోసా ఏదీ?

గిరిజన బాలికలు విద్యనభ్యసించే పాఠశాలల్లో ఇలాంటి ఆరోపణలు వెలుగుచూడటం విద్యార్థినుల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. తల్లిదండ్రుల తర్వాత అంతటి నమ్మకాన్ని పొందే ఉపాధ్యాయులపై ఇలాంటి ఆరోపణలు రావడం ఆందోళనకరం. విద్యార్థినులకు రక్షణ కల్పించాల్సిన వ్యవస్థలోనే భద్రతకు సంబంధించిన సమస్యలు తలెత్తుతున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.ఈ ఘటనపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, బాలికకు అవసరమైన రక్షణతోపాటు మానసిక సహకారం అందించాలి. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థినుల భద్రతకు సంబంధించిన నిబంధనలను పటిష్టంగా అమలు చేయాలి. ఆరోపణలు నిర్ధారణ అయితే చట్టప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి.

మట్టిలో మాణిక్యాలు.. శేరుపల్లి విద్యార్థులు



టీ మీడియా, అక్టోబర్ 24, శ్రీరంగాపూర్ :
ప్రభుత్వ పాఠశాలల్లోచదువుకొని తమ ప్రతిభతో ఉన్నత విజయాలు సాధిస్తున్న వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండలంలోని శేరుపల్లి గ్రామ విద్యార్థులు మట్టిలో మాణిక్యాలని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ కొనియాడారు. శనివారం సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారికి మార్గదర్శకత్వం వహించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా శంకర్ శంకర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ దాగి ఉందని, సరైన ప్రోత్సాహం, క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. చదువుతోపాటు క్రీడలపైనా ఆసక్తి పెంచుకొని అన్ని రంగాల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ (కత్తియుద్ధం) పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన సురేఖ, భువనేశ్వర్‌లోని సైనిక్ స్కూల్‌లో సీటు సాధించిన భార్గవ్, సీఈఓ కాలేజీలో సీటు పొందిన రూప, ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఫైనల్‌లో ఉత్తమ మార్కులు సాధించిన వర్షలను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు.విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయుల అంకితభావం, నిరంతర కృషి ఎంతో ఉందని పేర్కొంటూ ఉపాధ్యాయులు నరసింహ, రమేష్, ఈశ్వర్ రెడ్డి, ప్రసన్నలను కూడా సన్మానించారు. గ్రామీణ విద్యార్థుల ప్రతిభను వెలికితీసి వారిని ప్రోత్సహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల వెంకటయ్య, ఉపసర్పంచ్ బిచ్చన్న, ఎంఈఓ హనుమంతు, కళా వేదిక ప్రతినిధి బైరోజు చంద్రశేఖర్, రంగస్థల కళాకారుల జిల్లా అధ్యక్షుడు ఎల్. ఉమామహేశ్వర్, మొయినుద్దీన్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం



- **అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం**

టీ మీడియా, అక్టోబర్ 24, ఖమ్మం:
పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో మూడు నెలల్లో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ వైఎస్ఆర్ కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్)లో సుడా నిధులు రూ.1.30 కోట్లతో నిర్మించనున్న ఐదు అదనపు తరగతి గదులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి రెండు, మూడు వారాలకు ఒకసారి అధికారులు క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పరిశీలించి సమీక్షించాలని సూచించారు.

ప్రతి ఇంటికీ విద్యుత్ మీటర్, ఇంటి పన్ను ధ్రువీకరణ పత్రం

వైఎస్ఆర్ కాలనీలో నివసిస్తున్న ప్రతి కుటుంబానికి నిబంధనల ప్రకారం కొత్త విద్యుత్ మీటర్లు అందించేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రతి ఇంటికీ సరైన విద్యుత్ మీటర్ ఏర్పాటు చేయడంతో పాటు, అర్హులైన నివాసితులకు ఇంటి పన్ను ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఎవరూ అక్రమంగా విద్యుత్ వినియోగించకుండా చూడాలని, కాలనీలోని ప్రతి కుటుంబం నిబంధనలకు అనుగుణంగా విద్యుత్ సేవలను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమస్యలు పరిష్కరించాలి

2023లో మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి ఇంకా పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే భారీ చోరీ



- **బంగారం, వెండి ఆభరణాలు, లక్షల నగదు అపహరణ**

టీ మీడియా, అక్టోబర్ 24, బూర్గంపహాడ్ :
పట్టపగలే ఓ ఇంట్లో దొంగలు పడిన సంఘటన బూర్గంపహాడ్ మండల పరిధిలోని అంజనాపురంలో శనివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంజనాపురంలో లకావత్ బాల్య వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మధ్యాహ్నం సమయంలో కొందరు వ్యక్తులు ఆటోలో లకావత్ బాల్య ఇంటికి వెళ్లి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు అపహరించుకుపోయారు. పక్కింటి వారు సమాచారం ఇవ్వడంతో ఇంటికి వచ్చిన యజమాని ఇంట్లోకి వెళ్లి చూడగా తాళం పగలగొట్టి ఉండటాన్ని గుర్తించాడు. బీరువా తెరిచి ఉండటంతో దాచుకున్న 8 తులాల బంగారు ఆభరణాలతో పాటు వెండి ఆభరణాలు, నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ మేడా ప్రసాద్ బాధితుడి ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. ఈ సమాచారాన్ని పాల్వంచ సీఐ సతీష్‌కు అందించగా ఆయన హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకుని చోరీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏకకాలంలో నాకాబంది తనిఖీలు



- **అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పోలీసుల ప్రత్యేక చర్యలు**

టీ మీడియా, అక్టోబర్ 24, కొత్తగూడెం:
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ ఆదేశాల మేరకు కొత్తగూడెం సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఏకకాలంలో నాకాబందీ తనిఖీలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం వన్‌టౌన్ పరిధిలోని పోస్ట్ ఆఫీస్ సెంటర్, టూటౌన్ పరిధిలోని రామవరం మెయిన్ రోడ్, త్రీటౌన్ పరిధిలోని పాత డిపో, లక్ష్మీదేవిపల్లి పరిధిలోని ఇల్లందు క్రాస్ రోడ్, చుంచుపల్లి బైపాస్, సుజాతనగర్ మెయిన్ రోడ్ సెంటర్, జూలూరుపాడు పరిధిలోని మాచినేనిపేట క్రాస్ రోడ్, చంద్రుగొండ సెంటర్, అన్నపురెడ్డిపల్లి శివాలయం వద్ద పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.

అసాంఘిక కార్యకలాపాల నియంత్రణే లక్ష్యం

గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టడం, రోడ్డు ప్రమాదాలను నివారించడం, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించడం, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను తనిఖీ చేయడం ఈ నాకాబందీ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని డీఎస్పీ ఆదినారాయణ తెలిపారు.

తనిఖీల సమయంలో ట్రాఫిక్ నిబంధనలు, ఇతర చట్టాలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు శాఖ నిరంతరం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.

ప్రజలు సహకరించాలి

తమ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని అధికారులు ప్రజలను కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

- **పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

టీ మీడియా, అక్టోబర్ 24, ఖమ్మం:
రక్తదానం ఆపదలో ఉన్నవారికి ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పిలుపునిచ్చారు.పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకుంటూ ఖమ్మం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శనివారం ఖమ్మం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శిబిరాన్ని ప్రారంభించగా, మొత్తం 150 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు.దేశ రక్షణ, అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల స్ఫూర్తితో ప్రజాసేవలో భాగస్వాములు కావాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రక్తదానం అత్యంత విలువైన సామాజిక సేవ అని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఏ ఒక్కరి ప్రాణం ప్రమాదంలో పడకుండా స్వచ్ఛంద రక్తదాతలు ముందుకు రావాలని కోరారు. ఆరోగ్య వంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంపొందించుకుని, ఇత రులకు ప్రాణదాతలుగా నిలవాలని సూచించారు. పోలీస్ శాఖ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతలో భాగంగా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు వారి త్యాగాలను గుర్తుచేయడమే కాకుండా, సమాజం పట్ల సేవాభావం, బాధ్యతను పెంపొందించుకునేందుకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. రక్తదాన శిబిరంలో 150 మంది పాల్గొని రక్తదానం చేయడంపై పోలీస్ కమిషనర్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏఆర్ డీసీపీ కుమారస్వామి, టౌన్ ఏసీపీ రమణమూర్తి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, ఏఆర్ ఏసీపీలు సుశీల్ సింగ్, నర్సయ్య, డాక్టర్ కార్తీక్, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్, అప్పలనాయుడు, సీఐలు షాదీక్ పాషా, రామకృష్ణ, చిట్టిబాబు, నాగరాజు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.